## కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష

**బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు సముచిత స్థానం : మంత్రి సబితారెడ్డి**



మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ నాయకులు

మహేశ్వరం, అక్టోబర్ 29: బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు సముచిత స్థానం దక్కుతుందని, తెలంగాణ రాష్ట్రానికి సీఎం కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష అని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం గ్రామం కాంగ్రెస్ పార్టీకి చెందిన 100 మంది ముస్లిం నాయకులు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మినాజ్ పటేల్ ఆధ్వర్యంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై చాలా మంది ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో మహేశ్వరం నియోజక వర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నదని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని ఆశీర్వదించాలని కోరారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో మహేశ్వరం అభివృద్ధి ప్రదాతగా నిలుస్తున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మంత్రి సబితా ఇంద్రారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారిలో ఎంఏ ఫరీద్, ఎండీ మోసింఖాన్, మోబిన్‌ఖాన్, ముస్తాఫా ఖాద్రీ, అక్బర్ ఖురేషీ, అక్రం హుస్సేన్‌తో పాటు మరికొంత మంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగోతు రాజు నాయక్, సీనియర్ నాయకులు కర్రోళ్ల చంద్రయ్య ముదిరాజ్, మినాజ్ పటేల్, కో -ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఆథిల్ అలీ, శివగంగ దేవాలయ చైర్మన్ నిమ్మ గూడెం సుధీర్‌గౌడ్, మునగపాటి నవీన్, మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎంఏ సమీర్, ఎస్.కె. ఆజాం, పీఏసీఎస్ డైరెక్టర్ కడమోని ప్రభాకర్, షేక్ అబువాకర్, ఆజీబాబా, ఎస్.కె. అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇక్కడంతా బాగుంది..

**పెట్టుబడులకు హైదరాబాద్ అనువుగా ఉంది**

**హ్యాపీ హైదరాబాద్‌లో పలువురు ఉద్యోగులు, వ్యాపారవేత్తల అభిమతం**




కూకట్‌పల్లిలో జరిగిన హ్యాపీ హైదరాబాద్ కార్యక్రమంలో అభిప్రాయాలు వెల్లడిస్తున్న ప్రతినిధులు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 29 : హైదరాబాద్ నగరంలో మనమంతా క్షేమంగా ఉన్నాం. ఇదే పరిస్థితులు కొనసాగాలంటే మళ్లీ బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉన్నదని పలువురు నగర పౌరులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. కూకట్‌పల్లి ఎన్‌కేఎన్‌ఆర్ నగరంలో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాపీ హైదరాబాద్ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి బతుకుదెరువు కోసం వచ్చిన పౌరులు, వ్యాపారవేత్తలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న ప్రజలందరూ ఎలాంటి భయాందోళనలు లేకుండా సుఖసంతోషాలతో జీవిస్తున్నట్లు తెలిపారు. పెట్టుబడులు పెట్టడానికి, వ్యాపారాలు చేసుకోవడానికి అనువైన వాతావరణం ఉన్నదని.. ఇక్కడి శాంతిభద్రతలు, ప్రభుత్వం అందించిన సహకారం గొప్పగా ఉన్నదన్నారు. నగరంలో మౌలిక వసతుల కల్పన విషయంలో ప్రభుత్వం ఎంతో ముందుచూపుతో పనిచేసిందని.. తద్వారా పలు ప్రాంతాల వ్యాపారులు నగరంలో పెట్టుబడులు పెడుతున్నారని తెలిపారు. దీంతో నగరంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని, రాష్ట్రం పురోగతిని సాధించిందన్నారు. పరిశ్రమలు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు రావడంతో నగరంలో యువతకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందన్నారు. ఇలాంటి మంచి వాతావరణాన్ని కొనసాగించుకోవాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్తలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వివిధ కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో చల్లారని సెగలు

- **తాజా పరిణామాలతో గ్రేటర్‌లో పార్టీ మరింత బేజారు**
- **రేవంత్ తీరు పార్టీకి నష్టం చేస్తుందంటున్న నేతలు**
- **అభ్యర్థులు ఖరారైన ప్రచారానికి దూరం**

సిటీబ్యూరో/మేడ్చల్, అక్టోబర్ 29(నమస్తే తెలంగాణ): ఓటుకు సీటు వ్యవహారంతో గ్రేటర్‌లో కాంగ్రెస్ పార్టీ మరింత బలహీన పడుతోంది. టికెట్ల పంపిణీలో రేవంత్ చేతివాటం ఆరోపణలతో క్యాడర్ మరింత బేజారైపోతోంది. రెండో దఫా జాబితా వెల్లడితో మొదలైన అసంతృప్తి సెగలు గ్రేటర్ కాంగ్రెస్ క్యాడర్‌ను చెల్లాచెదురు చేశాయి. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో బలంగా ఉన్నామని చెప్పుకునే కాంగ్రెస్‌ను ముంచేలా అసమ్మతి నేతలు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే రేవంత్ వర్గం చేసిన బాగోతానికి ఆగ్రహంతో ఊగిపోతున్న అసమ్మతి నేతలు.. ఎన్నికల్లో ఆ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసేందుకు సిద్ధమవుతున్నారు. అభ్యర్థులు ఖరారైనా నియోజకవర్గాల్లో అసమ్మతి సెగలతో ప్యారాచూట్ నేతలు ప్రచారం కూడా చేసుకోలేకపోతున్నారు. దీంతో గ్రేటర్‌లో డిపాజిట్ ఆశలు కూడా లేకుండా పోతాయని హార్డ్ కోర్ కాంగ్రెస్ వాదులు రేవంత్ రెడ్డిని తిట్టిపోసుకుంటున్నారు.

**ప్యారాచూట్ నేతలు..**

సర్వేల పేరిట కొందరిని, ఫ్యామిలీ టికెట్ల పేరిట మరికొందరిని పక్కన పెట్టిన రేవంత్ రెడ్డి.. మొత్తానికి ప్యారాచూట్ నేతలను రంగంలోకి దింపాడు. ఇన్నాళ్లు పార్టీ కోసం పని చేసిన నేతలను కరివేపాకులా తీసిపారేశాడు. పార్టీకి సేవ చేసిన వారికంటే జేబులు నింపిన వారికే టికెట్లు దక్కాయని బహిరంగంగానే అసమ్మతి నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పెరుగుతున్న అసమ్మతి..**

రెండో జాబితా వెల్లడించిన తర్వాత గ్రేటర్‌లోని పరిస్థితి కాంగ్రెస్‌ను కుదుపేస్తోంది. ఇన్నాళ్లు పార్టీ జెండాను మోసిన నేతలు రేవంత్ తీరుతో పార్టీలో ఇమడలేకపోతున్నారు. కొందరైతే నేరుగా ఎన్నికల్లో పార్టీకి సహకరించేదే లేదని చెబుతున్నారు. జూబ్లీహిల్స్ టికెట్



బాలాపూర్ సమావేశంలో మాట్లాడుతున్న చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి

ఆశించి భంగపడిన పీజేఆర్ వారసుడు విష్ణువర్ధన్ రెడ్డి శనివారం వీరంగం సృష్టించాడు. ఆదివారం ముఖ్య నేతలతో నియోజకవర్గంలో సమావేశం నిర్వహించిన పీవీఆర్.. పార్టీని నమ్ముకున్న వారికి సరైన గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రచారం కరువు..**

ఓవైపు బీఆర్ఎస్ ప్రచారంపై దృష్టి పెట్టుకుని ఎన్నికల సమరంలో దూసుకుపోతుంటే.. కాంగ్రెస్‌లో అసమ్మతి సెగలు పార్టీకి తీవ్ర నష్టం చేస్తున్నాయి. గ్రేటర్‌లోని అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు పూర్తి స్థాయిలో ప్రకటించారు. కానీ, ఇప్పటికీ అభ్యర్థులు పార్టీ కార్యకర్తలను కలుపుకొని ప్రచారం మాత్రం మొదలు పెట్టలేదు. మేడ్చల్ జిల్లాలో మొత్తం ఐదు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించినా.. ఏ ఒక్క స్థానంలో కూడా ప్రచారం చేయలేకపోతున్నారు. కూకట్‌పల్లి నుంచి టికెట్ ఆశించి భంగపడిన గొట్టిముక్కల వెంగళరావు కాంగ్రెస్ క్యాడర్ మొత్తాన్ని బీఆర్ఎస్‌లో చేర్చుతున్నట్లుగా పేర్కొన్నారు.

**కాంగ్రెస్‌లో టికెట్ల లొల్లి..**

కూకట్‌పల్లి నుంచి టికెట్ ఆశించిన గొట్టిముక్కల వెంగళరావు ముఖ్య అనుచరులతో కలిసి స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లుగా ప్రకటించారు. జంటనగరాల్లో పీజేఆర్ వారసత్వాన్ని కొనసాగిస్తున్న, కట్టర్ కాంగ్రెస్ నేతగా చెప్పుకునే జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డికి జరిగిన అన్యాయంపై తీవ్ర అసహనంలో ఉన్నాడు. తాను మెచ్చిన, జేబులు నింపిన నేతలకే టికెట్లను అప్పగించి.. ఇన్నాళ్లుగా పార్టీ జెండా మోసినవారికి అన్యాయం చేస్తున్నాడని నేతల్లో ఆగ్రహం వ్యక్తం అవుతున్నది. రెండో జాబితాలోనూ టికెట్ల ఆశలు గల్లంతైన నేతలు, పార్టీల పక్క చూపులు చూస్తుండటంతో ఎన్నికల నాటికి మరిన్ని వలసలు పెరిగేలా ఉన్నాయి. మెజార్టీ కాంగ్రెస్ పార్టీ నేతలు బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపుతుండగా... గ్రేటర్‌లోనూ కాంగ్రెస్ ఆశావహులకు బీఆర్ఎస్ చుక్కానిలా నిలుస్తోంది.

## కల్లోలంగా మారిన కాంగ్రెస్

బడంగ్‌పేట : సీటుకు నోటు అంశంతో మహేశ్వరం కాంగ్రెస్‌లో మంటలు చెలరేగాయి. స్థానికేతరుడైన కిచ్చనగారి లక్ష్మారెడ్డికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వడం పట్ల స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మండిపడ్డారు. కేఎల్‌ఆర్ పోటీ నుంచి తప్పుకోవాలని.. లేదంటే ఎట్టి పరిస్థితుల్లో మద్దతు ఇచ్చే ప్రసక్తి లేదని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తేల్చి చెబుతున్నారు. స్థానికులైన చిగిరింత పారిజాతకే టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేస్తుంటే.. తనకే టికెట్ ఇవ్వాలని మరోనేత దేపా భాస్కర్ రెడ్డి తన బలగంతో సమావేశమాయ్యారు. ఆదివారం బాలాపూర్ చౌరస్తాలో ఉన్న సీఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో తనకే మహేశ్వరం ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని చిగిరింత పారిజాత తన అనుచరులతో భారీ సమావేశం ఏర్పాటు చేశారు. అదిష్ఠానానికి వ్యతిరేకంగా కార్యకర్తలు మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎర్ర మహేశ్వరి జై హింద్, బాలు నాయక్, రాళ్లగూడెం సంతోషి శ్రీనివాస్‌రెడ్డి, బాలు నాయక్, గ్రంథాలయ మాజీ చైర్మన్ కప్పాటి పాండు రంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా.. మరోనేత దేపా భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చల్లా నర్సింహారెడ్డి, జంగారెడ్డి, అమరేందర్‌రెడ్డి వారి వారి అనుచరులతో మాట్లాడుతూ.. మాలో ఒకరికి టికెట్ ఇచ్చినా.. కలిసి పనిచేస్తామన్నారు.

## అంబర్‌పేట కాంగ్రెస్‌లో అసమ్మతి సెగలు



అంబర్‌పేట, అక్టోబర్ 29: అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి సెగలు పుట్టుకొచ్చాయి. టికెట్‌ను ఆశించిన వారు ఒక్కొక్కరుగా తమ బాధను, అక్రోశాన్ని వెల్లగక్కుతున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావుపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. టికెట్ ఆశించి భంగపడిన కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ కో- ఆర్డినేటర్ అంబర్‌పేట శ్రీనివాస్ యాదవ్ ఆదివారం మీడియా సమావేశం పెట్టి తీవ్ర ఆరోపణలు చేశారు. పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. రేవంత్‌రెడ్డి అంబర్‌పేట టికెట్ అమ్ముకున్నాడు.. బీసీల అన్యాయనేత వి.హనుమంరావు ఉన్నంత వరకు అంబర్‌పేటలో పార్టీ బాగుపడదు.. అంటూ ఆరోపించారు. బస్తీల పేర్లు తెలవని రోహిన్‌రెడ్డికి టికెట్ ఇచ్చారు. అందుకే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నా.. పార్టీ రెబల్‌గా పోటీ చేస్తానని పేర్కొన్నారు.

## గాంధీభవన్ ఎదుట ఆందోళన.. ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిరసన

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 29: కాంగ్రెస్ పార్టీ నాయకులకే టికెట్లను కేటాయించాలంటూ ఆదివారం గాంధీభవన్ ఎదుట నర్సాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన బాట పట్టారు. కోవర్టు అయిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి హటావో.. కాంగ్రెస్ పార్టీకి బచావో.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఓటుకు నోటు దొంగ అయిన రేవంత్‌రెడ్డిని తొలగిస్తేనే కాంగ్రెస్ పార్టీ బాగుపడుతుందన్నారు. దాదాపు పది మంది కార్యకర్తలు తమ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఇతర పార్టీ నుంచి వచ్చిన ఆవుల రాజిరెడ్డికి టికెట్ ఎలా కేటాయిస్తారని మండిపడ్డారు. పార్టీని నమ్ముకొని ఏళ్ల తరబడి నాయకుడిగా కొనసాగుతున్న గాలి అనిల్‌కుమార్‌కే టికెట్ కేటాయించాలంటూ ఆందోళన వ్యక్తం చేశారు. భారీ స్థాయిలో చేరుకున్న అనిల్‌కుమార్ వర్గీయులతో గాంధీభవన్ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

# రండి బాబు రండి..!

- **ఇతర పార్టీల వైపు బీజేపీ ఎదురుచూపులు**
- **అభ్యర్థులు లేక కమలం సతమతం**
- **కాంగ్రెస్‌లో రెండో జాబితా చిచ్చు**
- **రగిలిపోతున్న ఆశావహులకు కమలం గాలం..?**
- **అధికార పక్షంలోకి వచ్చేందుకు అమితాసక్తి**

సిటీబ్యూరో, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్.. ఈ పేరు వింటే ప్రతిపక్షాల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఆ పార్టీపై ప్రజల్లో ఉన్న అభిమానం ముందు.. కాంగ్రెస్, బీజేపీలు నిలవలేకపోతున్నాయి. ఏ గల్లీ చూసినా గులాబీ జెండాలే.. ఏ ఓటర్‌ను కదిలించినా కారు ముచ్చటే.. ఏ ఇంటిని చూసినా కేసీఆర్ మాటే.. అంతలా బీఆర్ఎస్ పార్టీ ప్రజల్లో స్థానం సంపాదించుకుంది. ఇలాంటి పరిస్థితుల్లో బీఆర్ఎస్ అభ్యర్థులపై బరిలో దిగాలంటే కమలం పార్టీ కంగారు పడుతున్నది. దీటైన అభ్యర్థులు లేక ఆ పార్టీ నాయకులు పక్క పార్టీల వైపు చూస్తున్నట్టు తెలుస్తున్నది. రెండో జాబితాతో కాంగ్రెస్‌లో రేగిన చిచ్చుకు చాలా మంది ఆశావహులు హస్తంపై ఆగ్రహంతో ఊగిపోతున్నారు. పార్టీ కోసం కొన్నేండ్లుగా పనిచేస్తున్న తమని కాదని.. ప్యారాచూట్ నేతలకు టికెట్లు ఇవ్వడం, డబ్బులకు సీట్లు అమ్ముకోవడమేంటని కాంగ్రెస్ పార్టీ నాయకులు బహిరంగంగానే ఆ పార్టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిపై విరుచుకుపడుతున్నారు. ఈ క్రమంలో పార్టీకి దూరమవ్వాలనుకునే వారిని కాషాయం పార్టీ సంప్రదిస్తున్నట్టు తెలుస్తోంది. కొంతమంది ఫోన్‌లు చేసి పార్టీలోకి రావాలని ఆహ్వానం కూడా పంపిస్తున్నారని సమాచారం. అయితే, వారు కమలంలోకి వెళ్లడానికి నిరాకరిస్తున్నట్టు తెలుస్తోంది. గెలిచే పార్టీ బీఆర్ఎస్‌లోకి వెళితే రాజకీయ భవిష్యత్తు ఉంటుందని ఆలోచిస్తున్నారు. అందులో భాగంగానే కాంగ్రెస్ అసంతృప్తులు అధికార పక్షంలో చేరుతున్నారు. ఈ చేరికలు మరింతగా పెరగనున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

మరోవైపు తెలుగుదేశం పార్టీ తెలంగాణ ఎన్నికల బరిలో ఉండటం లేదని అధిష్ఠానం ప్రకటించింది. దీంతో తెలుగు తమ్ముళ్లు పార్టీ కార్యాలయంలో తన్నులాటకు దిగారు. ఓటమి ఖాయమని తెలిసే ఆ పార్టీ అధిష్ఠానం పోటీ నుంచి తప్పుకున్నట్టు తెలిసింది. నిరాశతో ఉన్న కొందరు తెలుగు తమ్ముళ్లు కూడా బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లడానికి మంతనాలు సాగిస్తున్నారని సమాచారం. హైదరాబాద్‌లో ఉన్న ఆంధ్ర సెటిలర్స్ అంతా బీఆర్ఎస్ పార్టీకే జై కొడుతున్నారు. ఇప్పటికే చాలా మంది బీఆర్ఎస్ కండువాలు కప్పుకున్నారు. ముఖ్యంగా కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్, శేరిలింగంపల్లి, సనత్‌నగర్, ఖైరతాబాద్‌లో ఉన్న తెలుగుదేశం క్యాడర్ అంతా బీఆర్ఎస్‌లోకి వెళ్లడానికి ఆసక్తి చూపించడం విశేషం.